# ప్రబుద్ధాంధ్ర

కళాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు:— శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము నవంబరు ౧౯౩౪ { సంచిక ౧౧

## ఇలాంటి తవ్వాయి వచ్చినట్టయితే........?

సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు

"పక్కనే అంత గట్టుండగా యేం పని సాయీబూ అదీ? నిక్షేపం లాంటి చెర్లోనే పుక్కిలించి వుమ్మేసుకోవాలా? మీకు మాత్రం యెంగిలి తప్పు కాదూ? కాండ్రించి కూడా—చెప్పిన కొద్దీ మరీని. పోనీ, నీ యిష్టం వచ్చినట్టు చేసుకో. ఎవళ్లెంత చేసుకుంటే అంతా వాళ్లే అనుభవిస్తారు. నాకేం?"

"నీకీ బుద్ధీ వుందీ లేదూ షోమ్ యాజుల్? సూక్క ధునూక్క షీదీ షీదీ, చెర్వూ వాంతా గరీబ్ చేషీ, హింకా మాకీ వాఛ్ఛేపన్ చేష్తావ్, భాన్సూ"

రామప్పసోమయాజులు మరి మాట్లాడలేకపోయాడు. "బుద్ధి గడ్డి తినడంవల్ల నిన్ను పలకరించా"నని మనస్సులోనే పశ్చాత్తాపపడ్డాడు. "అంతటితో చాలించి యిక వెళ్ళిపో మహాప్రభూ" అని కళ్లతో ప్రార్థించాడు.

ఎలాంటి కళని వున్నాడో సాయిబు కూడా యిక మాట్లాడలేదు; కాని అతను వొడ్డెక్కుతూండగా యాజులు పెద్దకూతురు యెత్తేటి కాళ్లేసుకుంటూ యెదురు వచ్చి, మొగం చిట్లించుకుంటూ వొక వోరకి తప్పుకుంది. కానైతే సాయిబు కూడా వొక పక్కగానే వున్నాడు. అక్కణ్ణుంచి కదలడం కూడా అతని కిష్టం లేదు. అయితే ఆమె వాలకం చూడగా అతనికి కొంచెం కోపం వచ్చింది. మొదట మొగం అయిమూలగా వంచి, మూతి బిగించుకు తీక్ష్ణంగా చూశాడు. తరవాత లోపల్లోపల యేమిటో గొణుక్కున్నాడు. చివరికి "బామ్మన్ సైతాన్కి గడ్డీ యేస్తాం మాకీ" అని తుబుకూతుబుకూ సావంచాల మీద కూడా వుమ్మేస్తూ గబగబా చక్కాపోయాడు.

"ఎవర్ని నాన్నా సాయీబు తిడుతున్నాడూ?"

"ఇంకెవర్నీ? ఎవళ్లకేనా బ్రహ్మగాళ్ళే కదా లోకువ? కానీ—తిట్టుకోనీ—ఈశ్వరుడు లేడూ?"

"అస లెందుకు వచ్చిందీ?"

"కాండ్రించి చెర్లో వుమ్మేస్తావా?" అన్నాను. అదీ అపరాధం. ఇక వొకటేమిటి, నానా మాటలూ—హారోం హర....."

యాజులు వొక్క ములుగు ములిగి, పిలక జాడించుకుని, ఆచమానం చేస్తూ యాదాలాభంగా పక్కకి చూడగా, కుండలు కొందరూ, బిందెలు కొందరూ పుచ్చుకుని, పాతికమంది మాదిగ స్త్రీలు

యొడమ వేపు గట్టు పొడూగునా వరసాగ్గా నుంచుని వున్నారు.

అసలే యాజులికి బహు చిరాకుగా వుంది. ఆపైన యెండెక్కి పోవడం దానిమీద వైశాఖమాసపు కారెండ నెత్తి మాడ్చేస్తూ వుండడం. పైపెచ్చు యిదీ.

అది చూశాటప్పటికి యాజులికి ఫెడీ మనీ వొక్క మెరుపు దెబ్బ తగిలిన ట్టయింది. తా నెక్కడ వున్నదీ, యేం చేస్తూ వున్నదీ, యేం జరుగుతూ వున్నదీ అతని కేమీ బోధపడలేదు. పైగా యెవరో కాళ్లకింద మంటలు పెడుతూ వున్నట్టు వొళ్లు రణ కంపర మెత్తిపోయింది. దాంతో అతను నిప్పులు తొక్కిన కోతి లాగ యెగిరి యెగిరిపడుతూ వొక్క పొలికేక పెట్టాడు.

కాని వాళ్లక్కణ్ణుంచి కదల్లేదు. ఆపెడ బొబ్బ కూడా వినిపించుకోలేదు.

"పోరేం?......మాదిగ పీనుగుల్లారా!.. పోతారా పోరా?"

"మంచినీళ్లకి వచ్చాం మండి"

"మీ చెరు వేమయిపోయిందీ?"

"కుష్టురోగపు అచ్చిగాడు దాన్లో పడి చచ్చి పోయాడండి"

"అయితే మాత్రం......"

"అనీ శ్శెలా తాగ మండి దొరగారూ?"

"కల్లుకంటే చెడిపోయాయా?"

"......................."

"పొండి పొండి, మున్సబు కరణాలకి తెలిస్తే పాతేస్తారు మిమ్మల్నీ...తొరగా—యింకా నుంచుంటారేం?"

"నీళ్ళు ముంచుకోకుండా వెళ్లి యేం చెయ్యమంటా రండి బాబయ్యా?"

"దాన్లో దిగా రంటే మహామ్మాయి వండించేస్తాను మిమ్మల్నీ, వెనక్కి మళ్ళరేం?"

"మేం దూరంగా పోతాం, మా కుండల్లో నీళ్లు పోసి వెళ్ళిపోండి కామందులు"

"అలాగేం? అబ్బో! ఎంత మదిరిందీ మీకు పొగరూ? ......పోతారా వొడ్డెక్కనా?"

"మాటకి మాట యెలా అందిస్తున్నారో చూశావా? స్నానం కూడా చేశావు నువ్వు వాళ్లతో మాట్టాడకు నాన్నా! అదిగో రామినీడుగారి అబ్బులు కామోసు బిందె పట్టుకు వస్తున్నాడు వాళ్లకి నీళ్లు పొయ్యడానికి. అతను వాళ్ల కుండల్లో పోశాటప్పుడు కొన్ని నీళ్లు కింద పడి చెర్లోకి దారి తీస్తాయి, నువ్వు తొరగా తెములుచ్చుకో"

ఈ మాట చెవిని పడేటప్పటికి యాజులికి కరిగిన సీసం కాళ్లకిందికి పాకి వచ్చిన ట్టయింది.

ఇక వొక జంధ్యాలు తోముకోడం లేదు. వొళ్లు తోముకోడం అసలే లేదు, సంకల్ప మేనా ప్రారంభం కాలేదు, చివరికి తడి బట్టేనా విప్పేసుకోలేదు; పక్కా గంట పట్టే స్నానం మూడు నిమిషాల్లో తేల్చుకుని, గభీమని వొడ్డెక్కి, పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ—దూకుతూ యింటికి వెళ్లిపోయాడు యాజులు.

"నిక్షేపం—గంగాళం లాంటి చెరువు తగులడి పోతుంది కామోసు. దిక్కుమాలిన కర్మం కాలవలు కూడా కట్టేశా రేం గతి యింకా?" అని సాగతీసుకుంటూ ఆమె కూడా అతని వెనక్కాలే యెగిరిపోయింది.

౨

ఎన్ని తరాలనుంచో, మాదిగల కొక చిన్నదీ, తక్కిన అన్ని కులాలవారికీ వొక పెద్దదీ, అవూళ్లో రెండు చెరువు లొక దానితో వొకటి కలిసే వున్నాయి. పెద్ద చెరువులో వున్న నిలవ నీరు పోవా లంటే చిన్న చెరువే దారి. చిన్న చెరువులోకి కొత్త నీరు రావా లంటే పెద్ద చెరువే దారి. ఇలాగ ఆరెండింటికీ ఆదికాలంనుంచీ యెడ తెగని

సంబంధం వుంది. పైగా వాటిని రెండింటినీ కలిపే తూము తరుచు తెరిచే వుంటుంది. అతూము దగ్గిరిగా మాదిగ లప్పు డప్పుడు మావులు కట్టుకోవడం కూడా వుంటూనే వుంటుంది,

అవూళ్లో అరవై యిళ్ల బ్రాహ్మ లున్నారు. మున్సబూ కరణమూ కూడా అక్కడ బ్రాహ్మలే. రయితాంగం — కమ్మవారు పాతిక యిళ్లవారున్నారు; కాని అట్టే మోతుబర్లు కారు. పాటకపుజనం కూడా చాలా కొద్దే అయితే మాదిగపిల్లిలో మాత్రం యాభై అరవై కొంప లున్నాయి.

అది యెప్పు డెలా తటస్థించిందో కాని, అవూళ్లో ముప్ఫయి తొమ్మిది ళ్ల తురకలు కూడా వున్నారు. వారిలో చాలామంది బీదలే: గాని తోళ్లవరకు లొక రిద్దరు సంపన్నులే వున్నారు. చిన్న మసీదు— కమ్మవీధి సానుకునే వుంది.

పదేళ్లకిందట మిషనరీలు వచ్చి మాదిగిపిల్లిలో వొక పాఠశాల లేవదీశారు. ఏడెనిమిది కుటుంబాల మాదిగల్ని మతంలో కూడా కలిపారు. అయిదారుగురు మొగపిల్లలు ప్రయిమరీలో తేలార్చు, పాఠశాలలో పాతికమంది పిల్లల పేర్లున్నాయి. పది పదిహేను క్రాపింగులు వెలిశాయి. అంతే. మాదిగలతో పాటు కిరస్తాని పంతులు కూడా అక్కడే—అలాగే కాపరం వున్నాడు. కాని మొత్తానికి మిషనరీలవల్ల మాదిగలకి వూళ్లో కొత్త పరపతి యేమీ కలగలేదు. మతంలో కలిసినవాళ్లనా మామూలు వృత్తుల్లోనే వున్నారు.

సంవత్సరం కిందట బదిలీ అయి వచ్చిన కిరస్తాని పంతులు మాత్రం కొంచెం ఘటకుడు

*     *     *     *     *

పోలీసులు శవాన్ని దహనం చెయ్యడానికి సెలవిచ్చి వెళ్లిపోయారు.

*     *     *     *     *

అతికష్టం మీద రెండు రోజు లెలాగో గడిచిపోయాయి. కిరస్తానీపంతులు గాంధిగారి మాట చెప్పి మాదిగపిల్లిలో కొంచెం పురెక్కించాడు.

ఆవేళ సాయంత్రం నాలుగు గంటలవేళ పెద్దమాదిగ లిద్దరు కిరస్తానీ పంతుల్ని వెంటపెట్టుకు వచ్చి నడివీధిలో కూచుని వున్న మున్సబుకరణాలనీ, బ్రాహ్మణప్రముఖుల్నీ, కమ్మదొరల్నీ సంబోధించి "మా మాట యేం చెప్పా రండి" అని అడిగారు.

"మాట్టాడ రేమండి కామందులు?"

"ఈరెండు రోజుల్నుంచీ యేం చేస్తున్నారురా ?"

"వో పూట వొకరూ, యింకోపూట యింకోరూ కమ్మదొరలు పోస్తున్నా రండి గట్టుమీద మా కుండల్లో నీళ్లు"

"ఇక ముందుకూడా—కాలవలు తెరిచి, చెరువుల్లో కొత్తనీరు పెట్టుకునీ దాకా అలాగే కాలక్షేపం చెయ్యండి".

"చెయ్యలే మండి"

"ఏం చేస్తారు మరి?"

"చెరువులో దిగి నీళ్లు ముంచుకోడానికి మాకు సెలవిప్పించండి"

అందరూ గతుక్కు మని వొకరికేసి వొకరు చూసుకున్నారు.

"ఇదంతా అకిరస్తాని పంతులు చేస్తున్నాడు" అన్నాడు వొక కమ్మదొర తల వూపుతూ, మెల్లిగా. మాదిగపిల్లిలో కిరస్తానీలు ప్రవేశించాక మాదిగలు చెప్పిన మాట వినడం మానేశా రని కమ్మవారికి కొంచెం గుర్రుగా వుంది.

"ఇప్పుడు మనం కొంచెం బిగించా మంటే యీ కిరస్తానీలను వెళ్లకొట్టించెయ్యవచ్చు చులాగ్గా" అన్నాడు యాజులు కళ్లగర వేసుకుంటూనూ అచొదరితోటి. అందరూ కొద్దిగానో గొప్పగానో తలలు వూపారు.

కిరస్తానీపంతులు వారి ముఖలక్షణాలను బట్టి సంగతులు గ్రహిస్తూ యెత్తులు వేస్తున్నాడు.

"వల్లకాదు. మీ తండ్రులనాడు—మీ తాతల

నాడు—మీ ముత్తాతలనాడు—ఎప్పుడేనా యెరుగుదురా మీరు ఆవాజిబీ?''

కళ్లెర్రజేసి వురుముతూ యిలా అడిగాడు కరణం.

"లేకపోతే మా చెరువులోకి నిండా నీరు విడిచిపెట్టించండి''

"అదీ వల్లకాదూ. వున్న కాసింత నీరూ మీకిచ్చేసి మేము మట్టి తాగమా?!''

"మరి మా మాటో దొరగారూ!''

"ఆమాట దేవుడి కొడుకు నడగండి''

మున్సబు చటుక్కున యిలా అనేశాడు; కాని వెంటనే నాలిక కరుచుకున్నాడు. అది చూసి కొందరు "ఫరవాలే'' దన్నారు. కొందరు "మాటలు విడిచిపెట్టకండి'' అన్నారు.

అప్పుడొక చౌదరి అందుకున్నాడు.

"ఎవరికీ యిబ్బంది లేకుండా కాలం వెళ్లిపోవాలంటే యిదివరకి నడిచిందే పద్ధతి. అయితే, అసమానూ మీ కందరికీ నీళ్లు పోస్తూ కూచోడానికి యెవరికి సాగుతుంది? కనక మా వాళ్లలో యెవర్నేనా రాయితీగా కుదురుస్తాను జీతం మీ రిచ్చుకోండి''

"దేవుడిచ్చిన నీరు మీ రంతా వూరికే వాడుకుంటూ వుండగా డబ్బిచ్చి మేము కొనుక్కోవాలా అండీ?''

"చచ్చినట్టు, లేకపోతే యేం చేస్తారూ?''

"బాగా ఆలోచించండి కామందులు''

"ఆలోచించే చెప్పాం. కాకపోయినా యిందులో ఆలోచించవలసిం దేమీ లేదు''

"మేము లేకపోతే మీ కొక్క రోజు గడవదు. మా కష్టసుఖాలికి మీరే పూచీ. బాగా పరకాయించుకోండి బాబయ్యా''

"ఇప్పటిమట్టుకు మీ కొంపల్లో వొక చెలమ తీసుకోండిరా''

పాకాల వున్న వొక శాస్త్రులు యిలా అనగా "అవునవును, ఫాదిరీదొరలు నుయ్యి కట్టించిపెట్టరాదూ మీకూ? వూరికే మతంలో కలుపుకోగానే తీరిందా'' అన్నాడు చౌదరి.

"ఎక్కణ్ణుంచో వచ్చిన ఫాదిరీలు మమ్మల్ని చూస్తారా బాబయ్యా?''

"అయితే యెన్ని తరాలనుంచో వున్న మతం యెందుకు వొదిలిపెట్టారు మీరూ?''

ఈమాట మీద "అలా నిలవతీసి అడగం'' డని వొకడూ, "ఇస్కూలు నేలమట్టం చెయ్యాలంటే యిదే సమయం'' అని మరొకడూ, "ముందు క్రాపింగులు గొరిగించెయ్యాలి'' అని యింకొకడూ —తలో మాటా కొంచెం గట్టిగానే అన్నారు.

ఇ వన్నీ పంతులు చెవిలో పడ్డాయి. గిర్రున తల తిరిగిపోయిం దతనికి. వెంటనే సరళమైన అతని స్వరానికి కరుకుతనం వచ్చింది.

"ఏ మంటారు?''

"మీరే చెప్పండి''

"రాజీ కుదరదు''

"కనపడుతూనే వుంది'',

"మన పూచీ వదిలిపోయింది. వారికి వారే రాజీకి వస్తే ఆలోచిద్దాం''

"......................''

"వెళ్లిపోదాం పదండి''

వొక్క క్షణం అయినాక "యేం బాబయ్యా, యేం సెలవూ?'' అని వొక పెద్దమాదిగ అడగ్గా, "నాలుగు పూటలు కళ్లు మూసుకుంటే వెళ్లిపోయీ దానికి తగువు పెంచా రేమిట్రా?'' అంటూ చౌదరి వెటకారం చేశాడు.

పంతులు వూపిరి బిగపట్టి మాదిగల కేసి దృఢ నిశ్చయంతో చూశాడు. "ఇక యెందు కేనా తయారే'' అన్నట్టు తల లూపి "పదండి'' అంటూ మాదిగలు దారి తీశారు.

* * * * *

"మనం మన జాగ్రత్త మీద వుండడం మంచిదీ'' అని యాజులు చెప్పిన సలహా మీద పెద్ద లందరూ

ఆలోచించి, రాత్రీ పగలూ కూడా సరిహద్దు గట్టు మీద కాపలా వుండడానికి మెరికల్లాంటి యిద్దరు కమ్మ యువకుల్ని జీతానికి పెట్టారు.

3

పంతులు తల చించుకున్నాడు. కాని వుపాయం తోచ్చలేదు. అయితే, పెద్ద చెరువులో దిగి తీరాలన్న పట్టుదల మాత్రం అతని కొంత మాత్రమూ తగ్గలేదు, సరికదా పెనవేసుకుపోతూనే వుంది.

"ప్రయోజనం కలగదు" అని నిశ్చయం చేసుకునే అతను రామచంద్రపురం వెళ్లి యీసంగతులన్నీ హరిజనసంఘాధ్యక్షునితో చెప్పి సాయం చెయ్యమని కోరాడు. దానిమీద "తప్పకుండానూ" అంటూ ప్రారంభించాడు అత్యాగమూర్తి "మీ వుద్దేశం చాలా మంచిది. మీ దీక్ష నాకు పారవశ్యం కలిగిస్తోంది హరిజనసోదరుల చిక్కులను నేను మిక్కిలీ పరితపిస్తున్నాను. కాంగ్రెస్సు దృష్టి అంతా యిప్పుడు హరిజనుల పక్షంగానే వుంది. అయితే—మీరు కొంచెం విశాలభావంతోటీ, విశ్వమానవసౌభ్రాత్రంతోటీ, లోకకల్యాణదృష్టితోటీ యీ సమస్యని సమన్వయించాలని కోరుతున్నాను. ఇది చాలా సందిగ్ధస్థితి. పైగా మీ వూరి పరిస్థితులు వేరు. ఇంతకీ: ఇప్పుడు కాంగ్రెస్సు సాంఘికబహిష్కారాన్ని దూరంగా పెట్టమని చెప్పి అసెంబ్లీ యెన్నికలలో వురికింది. మీవూళ్లో డెబ్భయి తొమ్మిది వోట్లున్నాయి. అన్నీ అగ్రజాతులవారిలోనే వున్నాయి. మీ మిప్పుడీస్వల్పవిషయంలో కలగచేసుకున్నామంటే విశ్వవ్యాప్తమైన హిందూస్థానభవితవ్యానికి అపాయం సంభవించగలదు. కనక మీ రిప్పుడీసంకుచిత దృష్టి విడిచిపెట్టి రాట్నం చేపట్టండి. హిందీ నేర్చుకోండి. గ్రామపునర్నిర్మాణానికి బలం కలిగించండి. కాంగ్రెస్సువారిని మీ రంతా కలిసి అసెంబ్లీకి పంపకలిగా రంటే అప్పుడు మీ పని చక్కగా—చూడండీ! ఆంధ్రరాష్ట్రీయకాంగ్రెస్సు కమిటీ అధ్యక్షపదవిని మీ వంటి హరిజనసోదరునికి ఇవ్వాలని నేను ఘోరంగా వాదించబోతున్నాను. మరి దయచెయ్యండి"

పంతులు తుళ్ళిపడ్డాడు. మరి అక్కడ నుంచో లేదు.

*** *** ***

రాత్రి తొమ్మిది గంటలు అయింది అప్పుడే భోజనం చేసివచ్చి పంతులు ఆరుబైట పడక్కుర్చీలో కూచున్నాడు. అంటించిన చుట్ట పూర్తి అయ్యేటప్పటికి మాదిగకులపెద్దలు నలుగురు వచ్చి చుట్టూ కూచున్నారు.

"అప్పుడే వారం రోజులు గడిచిపోయాయి. దారితెన్నూ యేమీ కనపడ్డం లేదు. పెద్దకులాలవారికీ మనకీ తగువు మాత్రం పెరిగిపోయింది"

"నిజమే. ఎప్పటికేనా మన కిదే దారి. వారూ మనమూ యిష్టంగా వున్నంతకాలమూ మన కేమీ లాభం కలుగదు. మనం వారి చుట్టూ—మా బతుకు మీ దయాధర్మబిచ్చాలమీదే వుందని మనం దేవుళ్ళాడినంత కాలమూ మన చిక్కులూ, ఇబ్బందులూ వారికి బోధపడవు. "వీళ్ళని చెండనాడుకుంటే మన పని బండిసున్నా అవుతుం" దని వారికి కష్టతోచేటట్టు మనం చెయ్యగలిగినప్పుడే వారు మనల్ని మనుష్యులని భావించి రాజీకి వస్తారు"

"కాలవలు తెరిచా రంటే—"

"తరవాత మనకి మన్నే. ఈలోపునే కావాలేమయినాను. అయినా యింకా యిరవై మూడు రోజులు మనకి గడువుంది. ఏలాను దగ్గరేనా మరామత్తు పూర్తికాక అధికార్లు మరో పది రోజులు గడువు పెంచడం కూడా వుంటూ వుంటుంది. కంగారు పడకండి. నేను నాకరికి సెలవు పెట్టి యీ పనిలోనే మునిగి వుండడం మీరు చూస్తూనే—"

"పోనీ, మనం కట్టు కట్టి వారి పనులు మానేస్తే ?"

"మనమే చెడిపోతాం. మీచేత ఆపని చేయిస్తే నాకు పేరు రావచ్చు. పత్రికలు "వోహోహో" అని పొగడవచ్చు. కాని నెగ్గించుకోలేక మీరు మాడిపోతారు. చివరికి వారి కాళ్ళూ కడుపూ పట్టుకోవలసివస్తుంది"

"......................"

"......................"

"ఏరాత్రో పెద్ద చెరువు నీరు కూడా మురుక్కాలవలోకి కొట్టేస్తే ?"

"......................"

"......................"

"పెద్దకులం వారిని యుద్ధానికి కవ్వించామన్న మాట"

"రయితులు మనకంటే తక్కువ వున్నారు. కర్ర పుచ్చుకున్నా మంటే బాపనోరు తలుపులు బిగించుకుని—"

"చుట్టుపట్ల వూళ్లు లేవూ ?"

"మాదిగిపిల్లులు మాత్రం—అవును లెండి"

"నిదానించండి. మనం పెద్ద చెరువులో దిగితీరాలి. ఇది తప్పదు. మీ రీ పట్టు మాత్రం విడవకూడదు. మంచి వుపాయం—"

సరిగా యీ సమయంలో "నాకు దొరికిందండోయి !" అంటూ విస్సన్న నగర్చుకుంటూ వచ్చాడు. కులపెద్దలు "పరుగు పరుగున వచ్చాడు. ఆయాసం తీర్చుకోనివ్వండి పాపం" అన్నారు. "మంచినీళ్ళు పుచ్చుకుంటావా ?" అన్నాడు పంతులు. దానికి వద్దని బుర్ర వూపుతూ నగర్చుకుంటూనే "నేను తురకమతం పుచ్చుకుంటా" నన్నాడు విస్సన్న. అది విని కులపెద్దలు "ఛా, ఛా! ఏం పనిరా అదీ ?" అని మూతి విరిచారు; కాని "వుండం" డంటూ పంతులు వొక్క నిట్టూర్పు విడిచాడు.

పంతులుకి నిజంగా చెరువులో దిగి సావకాశంగా స్నానం చేసినంత వుత్సాహం కలిగింది. చాలా నిదాన మైన బుద్ధి కలవాడతను. తాను మాల కెంకడుగా వుండేటప్పటికంటే యిప్పటి తన స్థితి అన్ని విధాల బాగానే వుంది. చదువుకి చదువు, వుద్యోగానికి వుద్యోగం, డబ్బుకి డబ్బు, పలుకుబడికి పలుకుబడి, గౌరవానికి గౌరవం—యేమీ లోటు లేదు. కాని మతంలో కలిసినా తాను వూళ్లో కాపరం చెయ్యడానికి వల్ల కాదు. చెరువు ముట్టుకోడానికి వీలులేదు. ఇక కిరస్తానిమతంవల్ల మాదిగల కేం లాభమూ ?

బాగా ఆలోచించాడు పంతులు. "తురకమతంలో కలిస్తే స్వేచ్ఛ. ఎవరూ దేనికీ అట్టుకోరు. వూళ్ళో అందరి యిళ్లల్లోకీ వెళ్లవచ్చు తురక అంటే యెవరూ నో రెత్తరు" ఈలాభాలు స్పష్టంగా కనపడ్డాయి అతనికి"

"నీకే తోచిందా?"

"రామచంద్రపురం నుంచి వస్తూ కరీం సాయీబుగారు చెప్పారు"

"అందరూ కలవాలన్నారా?"

"ఇష్టం వున్నవాళ్లు— పెద్ద చెరువులో దిగాలని, వూళ్లో అందరి యిళ్ళలోకీ వెళ్ళాలని ఉన్న వున్నవాళ్లందరూ రావచ్చు నన్నారు."

"సెబాస్" అని యెగిరి గంతు వేశాడు పంతులు; కాని కులపెద్దలికి మొదలూ తుదా యేమీ కనపడలేదు.

"నువ్వే మన్నావు ?"

"నా మట్టుకి నేను సిద్ధం అన్నాను"

"మరి నీకు కులం ?"

"కులంకోసం కులం విడిచిపెట్టేస్తాను నేను"

"తక్కినవాళ్లెవళ్లూ కలవకపోతేనో ?"

"వాళ్ల కర్మం"

"................."

"బర్మాలో నేర్చుకున్నాను కనక హిందూస్తానీ బా కిదివరకే వచ్చును ఏను కొండల వాడి మొక్కుంది కనక గడ్డం—మూసుకోండి"

"................"

"నేను గ్రామనౌకర్ని కనక కరీం సాయిబుగారి తోటి కరణంగారి యింటోకీ, మున్సిబుగారి యింటోకీ—బాపనోరి యిళ్లన్నీ దూరేస్తాను. రోజూ చెర్లోనే తాన మాడతాను"

"అంతటితో పూరుకో"

ఇలా అంటూ పంతులు వాళ్లి నందర్నీ యిసూ్కలు వాళ్లోకి తీసుకువెళ్లి రహస్యాలోచన సాగించాడు.

౪

"సలామ్ మహరాజ్!"

"ఏ పూరు—విస్సిగా!"

"అయ్యా! మీకీ యింకా అస్మంటీ మాటా పన్కీ రాద్: యిస్సన్న నిన్నటీక్కీ యిస్లామ్ మతంలో కల్సిపోయాడ్. పేరూ సెప్తాం, యిస్మాయిల్ సాబ్! ఆయా మీకీ సలాం చెప్పే వుండాడ్ కన్కా మీకీ మల్లీ బదుల్ సలామ్ చెప్పాలాఅండీ"

"ఏమిటీ, యేమిటీ!" అంటూ కరణం పడక్కుర్చీలోనుంచి లేవబోయాడు; కాని సాగింది కాదు. అమాట వినడం తోటే నడుము విరిగిపోయిందతగాడికి. అయితే, వెంటనే రెండు చేతుల తోటీ కళ్లు మూసుకుని లోపల్లోపలే "రామా, రామా" అనుకుంటూ అలాగే వుండిపోయాడు.

కరణం స్థితి యిలా వుండగా, సరిగా యీ సమయంలోనే ఇన్కంటాక్సు నోటీసు చేత్తో పుచ్చుకుని "నిద్రా యేమిషోయ్?" అంటూ రామప్ప సోమయాజులు వచ్చాడు. కరీముని, ఇస్మాయిల్నీ సింగుమ్మంలో నుంచే చూశాడతను; కాని యిద్దరికీ గడ్డా లుండడంవల్ల యిద్దరూ తురకలే అయి వుంటా రనుకున్నాడు? కాని పరకాయించి చూడలేదు. దగ్గిరకి వచ్చాకనే అతని కళ్లు కరణంమీదే పడ్డాయి. ఇంతే కాక, అస లతనికి అనుమానపడవలసిన అవసరం యేం వచ్చింది?

అప్పుడు కరీము వొక కుర్చీ కరణానికి దగ్గిరగా వేసి "కూచోండి మహరాజ్" అని యాజులుతో చెప్పి పక్కకి తిరిగి కన్ను గీటాడు. వెంటనే యిస్మాయిలు "సలామ్ యాజుల్ మహరాజ్" అన్నాడు. యాజులు కుర్చీమీద కూచుంటూ, "అభీష్టసిద్ధి—" అని ఆశీర్వచనం చేస్తూ యాదాలాభంగా కన్నెత్తి చూస్తాడు కదా కుడిచెయ్యి అలాగే నొసట వుంచుకొని, చిరునవ్వు నవ్వుతూ, వంగి విస్సిగాడు—

యాజులు వులిక్కిపడ్డాడు. ఆకంగారులో కుర్చీ వెనక్కి పడిపోయింది. కుడిచేతిలో వున్న నోటీసు వొక వేపుకీ ఎడమచేత్తో వున్న పొడుముకాయ వొక వేపుకీ పడిపోగా యాజులు కొలికితలా పడి వొక్క క్షణానికి పక్కకి దొర్లి లేచి, తూల్తూ తూల్తూ దూరంగా వెళ్లిపోయి "వోరి మాదిగిపీనుగా" అని యిక మాట్లాడలేకపోయాడు.

ఇదంతా వేళ్ల సందుల్లోనుంచి చూస్తూనే వున్న కరణం యిక లాభం లేదని నిశ్చయించుకుని యెత్తుపడిపోయినవాడిలాగ మెల్లిగా లేచి కూచున్నాడు.

"ఈదురంతం యేమిషోయ్ కరణం?"

"తురకల్లో కలిశాడు విస్సిగాడు—"

"అద్గో, అద్గో. అస్మంటీ మాటా—చెప్పొనూ లేదూ మహరాజ్? యిస్సన్నా జాంతే నై. యిస్గాడూ మర్గయా అనోక్కండి. యిస్మాయిల్ సాబ్ చెప్పండి. లేకపోతే బడా తంటాల్—హంతా మీకీ యెరుగుదుర్"

"ఏమిషోయ్ యీ ఫుట్టిమునకా!"

"మనకర్మం. ఇంకేం చేస్తామూ? రండి, కూచోండి"

"ఛా, ఛా! తన్ని తగిలెయ్యక వాణింకా—"

"ఖబర్దారీ యాజుల్ సాబ్! మాకీ ముసల్మాన్! హూా, హిన్దూ మీకీ పప్పూ—"

"కరీం! వూరుకో. వారు పెద్దలు—"

"పెద్దల్కీ, చిన్నల్కీ తేడా వుండ్వాలా. ఘుస్సాఘుస్సా మాటల్ సెప్తే—మహరాజ్! మాకీ ఘూరవం కావాలా. మీకీ ఘూరవం చేస్తామ్. బరాబర్"

ఈసందట్లో యాజులు మేఘాల మీద యెగిరిపోయాడు.

కరణం వొక్క క్షణం ఆలోచించాడు, కాని యేటూ పాలుపోలేదు. చివరి కతను "యీ దెయ్యాలు వొదిలిపోతే చాలు" నని నిశ్చయించుకుని "నాకు దొడ్లో పనుంది. మీ రిప్పటికి వెళ్లిపొండి" అని నౌకర్లకి చెబుతూ మాట వినిపించుకోకుండా లేచి చక్కాపోయాడు.

ఇదంతా చూశాటప్పటికి యిస్మాయిలుకి చీకట్లోనుంచి గభీ మని వెలుగులో పడ్డ ట్టయింది. యుగయుగాలనుంచి వున్న పుట్టుగుడ్డితనం పోయి వున్నట్టుండగా అతినిశిత మైన చూపు వచ్చిన ట్టయింది. ఇప్పుడే తల్లి కడుపులోనుంచి పుట్టి, పుట్టిన వెంటనే ప్రాజ్ఞత వచ్చినట్టున్నూ అయింది. దీనితో అతనికి బ్రహ్మానందం కలిగింది. చూస్తూ వుండగా కళ్లల్లోనుంచి బాష్పప్రవాహం వురకలు వేసుకుంటూ లంఘించింది. ఇది యిలా వుండగా: మాదిగపిల్లిలో మట్టుకే గడప దాటి లోపలికి వెళ్లగల తనకి అందరి యిళ్లల్లోనూ సంచరించడానికిలాంటి అధికారం యిచ్చిన యిస్లాము మీద అతని కపార మైన భక్తీ, విశ్వాసమూ కలిగాయి. ఇదంతా కరీము సలహావల్లనే తనకి సంభవించడం కూడా అతనికి జ్ఞాపకం వచ్చింది. వెంటనే అతను కరీం పాదాలమీద పడి "భాయీ! నీ రుణం నేను తీర్చుకోలేను. నే నిదివరకి పురుగుకంటే అన్యాయంగా బతికాను. నేనూ మనిషినే అని తల యెత్తుకుని తిరగ్గల అదృష్టం నా కిప్పటికి కలిగింది. ఇస్లాం మతం రాజామతం. భాయీ! నేను యిస్లాము మతాన్ని నిందించిన వాడి నాలిక పెరికేస్తాను. ఇస్లాము మీద పగబట్టినవాణ్ణి పాతేస్తాను. ఇస్లాం మతం కోసం నేను ప్రాణా లిచ్చేస్తాను" అని యిక మాట్టాడలేకపోయాడు.

దీంతో కరీముకి ముందు గంభీర మైన ఆనందమూ, తరవాత అత్యున్నత మైన గర్వమూ కలిగాయి. అతనికి మహమ్మదువారు వచ్చి తన శిరస్సుమీద చెయ్యి వుంచి దీవించిన ట్టయింది. వెంటనే అతను యిస్మాయిల్ని లేవదీసి, గడ్డం సవరించుకుంటూ యెదురొమ్ము విరుచుకు నిలిచి "యిస్మాయిల్! భాయీ! మతం అంటే యిస్లాం వొక్కటే మతం. మన్సి అంటే ముసల్మాన్ వొక్డూ మన్సి. దేవ్డూ అంటే అల్లా వొక్డూ దేవ్డు. గుర్వూ అంటే మహమద్‌వార్ వొక్రూ గుర్వు. తెల్సిందీ భాయీ! మన్కీ మతంలో మన్సికీ మన్సికీ యెక్వా తక్వా లేవ్. నవాబ్, గులామ్ వొక్టే కంచంలో నాష్టా పడ్తార్. ప్యారీ యిస్మాయిల్! యిదీ వొక్టే యినోక్కీ. అల్లా కటాక్షం సల్లంగా వుండ్తే ముసల్మానూకీ లుక్సాన్ లేను. ముసల్మానూకీ దుఃఖం లేదు. ముసల్మానూకీ బయ్యం లేదు. ముసల్మానూకీ షత్రుల్ లేదు. ముసల్మానూకీ అపాదెం లేదు. నమ్మ భాయీ!" అని అతన్ని కౌగిలించుకుని పరవశుడైపోయాడు.

౫

పదిన్నర అయింది. పావంచాలూ, చెరువూ బ్రాహ్మణమొగాళ్లతో నిండిపోయి వున్నాయి. చెంబులు తోమేవాళ్లు కొందరు. బట్ట లుతికేవాళ్లు కొందరు. స్నానం చేసేవాళ్లు కొందరు. కబుర్లు చెప్పేవాళ్లు కొందరు. జాతేహాలు పన్నివాళ్లు కొందరు. వొకచోట సంభావనల గొడవ. వొకచోట వరకట్నాల బేరం. ఇంకోచోట దొంగ సాక్ష్యాల పన్నాగం. మరోచోట వడ్డిలెక్కలు.

వేరొక చోట మనోవర్తి దావాల ఆలోచనలు. మధ్యమధ్యా, అక్కడక్కడా వేశ్యాప్రశంసలు. సంగీతాలు. చాటుధారపద్యాలు. ప్రాస్తావిక శ్లోకాలు. ఇంగ్లీషు టప్పాలు. అసావాదిత్యో బ్రహ్మలు. అర్ఘ్యప్రదానాలు. గాయత్రీజపాలు. వూతపదాలు. వో! వొక టేమిటి, రేవంతా మహా కోలాహలంగా వుంది.

ఇలాంటి స్థితిలో:

అటు మాదిగిపిల్లిలో నుంచి పిన్నలూ, పెద్దలూ — స్త్రీ పురుషులు యెనభై తొంభై మంది బిల బిల్లాడుతూ వచ్చి సరిహద్దు గట్టుమీద వరసలు తీరి కూచున్నారు.

ఇటు తురకపేటలో నుంచి జమాజెట్టీల్లాంటి యువకులు పాతిక ముప్ఫయిమంది లాఠీకర్రలు పుచ్చుకు వచ్చి దక్షిణపు గట్టుమీద మీసాలు దువ్వుకుంటూ, వంకరచూపులు చూసుకుంటూ బారులు తీరి నుంచున్నారు.

బ్రాహ్మ లందరూ అదీ యిదీ కూడా చూశారు. అయితే, అ దేమిటో, యి దెందుకో యేమీ బోధపడకపోయినా తురకలూ, మాదిగలూ గూడుపుఠాణీ చేస్తున్నారనీ, యిప్పు డేదో వొక సాహస కౌర్యం జరిగిస్తా రనీ మాత్రం తట్టింది. వెంటనే ఆరణగౌణధ్వని అంతా చప్పగా చల్లారిపోయింది. పైగా వా రందరికీ యెక్కడ లేని చురుకూ వచ్చింది. అష్టోత్తరశతగాయత్రికి సంకల్పించిన వారు అప్పటి కయినంత సంఖ్యతో చాలించి ఆచమానం చేశారు. పూర్తిగా సంధ్యావందనం చెయ్యబూనినవారు అర్ఘ్యప్రదానంతో పూర్తి చేసేశారు. సబ్బు వుపయోగించదలచినవారు వొట్టి చేతులతో నేనా తోముకోకుండా స్నానం ముగించేశారు. కట్టుకున్న బట్టలు వుతుక్కుందా మని నిశ్చయించుకున్నవారు ఆబట్టలు విప్ప నేనా విప్పకుండా చెంబులతో నీళ్లు ముంచుకో సాగారు.

ఇలాగ వొక్క నిమిషం గడిచింది. రెండో నిమిషంప్రారంభం అయింది; కాని అది పూర్తి కాకుండా కరీమూ, యిస్మాయిలూ యేనుగు గున్నలలాగ వచ్చి చివరి పావంచామీద నుంచున్నారు.

కరీము కరీమే. ఇక రెండో మనిషా? కనురెప్పలు రెండుమాట్లు ఆడేటప్పటికి అతను మాదిగి విస్సిగా డని అందరికీ తెలిసిపోయింది. వెంటనే అందరికీ శరీరాలు గరిపొడిచాయి. చెవులు గళ్లుపడ్డాయి. మనస్సులు చెదిరిపోయాయి.

అయితే వా రింకా సరిగా తేరుకోకుండానే దక్షిణపు గట్టుమీద నుంచి చెవులు గింగురు మనేటట్టు వొక యీల వినవచ్చింది. అది పూర్తి కావడం తరవాయిగా కరీము యిస్మాయిలు కేసి చూస్తూ "అల్లాహో అక్బర్" అని గొంతెత్తి అన్నాడు. తరవాత యిస్మాయిలు బ్రాహ్మల కేసి చూస్తూ అంత కంటేనూ గట్టిగా "అల్లాహో అక్బర్" అని రెండు చేతులూ పైకెగరవేశాడు.

అంతే. వెంటనే యిద్దరూ గభీ మని గభీ మని బ్రాహ్మల మధ్య వురికారు.

దాంతో అగాధ మైన సముద్రంలో పెద్ద కొండలు విరుచుకు పడ్డట్టయింది. చేటలతో కొట్టినట్టు బ్రాహ్మ లందరిమీదా నీళ్లు చిందాయి. కొందరికి వూపి రాడక వుక్కిరిబిక్కి రయింది. కొందరు హఠాత్తుగా యెగసిన కెరటాలకు తట్టుకోలేక వూగిస లాడారు.

కాని యెవరూ కోప్పడలేదు. "ఏం పని యిదీ?" అనేనా అనలేదు. నోళ్లలో నైనా గొణుక్కోలేదు. దురాయి కట్టినట్టందరూ కిక్కురు మనలేదు. కొందరు కొయ్యయిపోయారు కూడానూ.

బ్రాహ్మ లిలాగ శిలావిగ్రహా లయిపోగా కరీమూ, యిస్మాయిలూ "వొల్లూ సల్లపడిందీ భాయీ" అంటే, "ప్రాణాలు తేరుకున్నాయి భాయీ" అని వొళ్లు తోముకోవడం మొదలుపెట్టారు.

బ్రాహ్మలకి సముద్రంలో వుం దన్న బడబాన లం యిప్పుడు ఆచెరువులో ప్రత్యక్షం అయింది. వారిలో వొక్కరూ కూడా యిక క్షణ మేనా వుండలేకపోయారు. ఎలా వున్నవా రలాగ— యెక్కడున్నా వా రక్కణ్ణుంచి వొడ్డెక్కి, వెనక్కి తిరిగి చూడకుండా—నింపాదిగా కాదు—వురకలూ పరుగులూ పెడుతూ మాయ మైపోయారు.

ఇది చూసి మాదిగ అందరూ దిక్కులు బద్దలాసి పోయే టట్టు చప్పట్లు చరిచారు. తురకయువకులు ఆకాశం చిల్లులు పడిపోయే టట్టు యీలలు వేశారు.

కరీమూ, యిస్మాయిలూ విరగబడి నవ్వారు.

“.........................”

?

---

# నిజాము రాజ్యములోని తెనుగువారి స్థితి

సురవరము ప్రతాపరెడ్డిగారు బి. ఏ., బి. ఎల్

ప్రబుద్ధాంధ్ర సంపాదకులు “నిజాంరాజ్యంలోని తెనుగువారి స్థితి అని రాస్తే చాల సంతోషిస్తాను” అని నాకొక జాబు వ్రాసినారు. వారి కోరిక అనుల్లంఘనీయము. ఏదేని విషయమును గురించి వ్రాయు మనిన నా కొందోళన కలిగి యుండెడిది. వారే వస్తునిర్దేశము చేసి వ్రాసినందున శ్రమ తప్పినది. నాకును నిదే విషయమును గురించి బ్రిటిషిండియాలో నుండు ఆంధ్రసోదరులకు తెలుపుకొనవలెనని బహుకాలమునుండి కోరిక యున్నది. ఏమి గ్రహచారమో యేమో నిజామాంధ్రు లన్న నిజాములో వలెనే బయటను నిరాదరణమే కనిపించుచున్నది. ఇచ్చట లక్షల కొలది యాంధ్రుల కుండు కష్టసుఖములను గురించి కావలసినంతగా వ్రాయువారే లేరు. మహారాష్ట్రుల కుండు నభిమానములో దశాంశము కూడ నాంధ్రులలో లే దనవచ్చును. నిజాము రాష్ట్రములోని హిందువులకు అందు ముఖ్యముగా మహారాష్ట్రులకు కష్టములు కలిగిన బొంబాయి రాష్ట్రపు పత్రిక లేమి, నాయకు లేమి తీవ్రచర్యలు చేయుచుందురు. కాని మన ఆంధ్రసోదరులలో నిట్టివి కాంచుట లేదు. ఏ తాలూకా మూలయందో యే చిన్న సభయో జరిగిన దానికి ముఖ్యస్థాన మిత్తురు కాని అఖిలనిజామురాష్ట్రాంధ్రులకు సంబంధించిన ప్రథమద్వితీయమహాసభలు (Conferences) జరిగిన వాటికి దగు స్థాన మిచ్చు పత్రిక లేకపోయెను. కావున మా కథ కొంత యైనను నాకు తెలసినంత మాకు ప్రమాదము లేకుండు నట్లుగా వ్రాయ గలిగినంత బ్రిటిషాంధ్రసోదరులకు తెలుపుకొనిన నిక ముందైనను మమ్ము వలసపోయిన వారినిగా, లేక అనాగరికులనుగా తలపక మాయందు సానుభూతి చూపి మాకే కష్టములు వచ్చినను అవి తమ కష్టములుగా భావించి సర్వవిధముల సాయపడుదు రని యాశతో వ్రాయుచున్నాను.

నిజాము రాష్ట్రముయొక్క మొత్తము వైశాల్యము ౮౨౬౯౮ చదురపు మైళ్లు. దీనిలో ఆంధ్ర ప్రాంతముయొక్క విస్తీర్ణము ౪౧౩౪౧ చదురపు మైళ్లు. (అనగా నిజాము రాష్ట్రములో సగము భాగము). ఈరాష్ట్రములో ౧౬ జిల్లాలు కలవు. అందు తెనుగు జిల్లాలు ౮.